# దేవుడు కనిపించాడు!

## - వేదుల శకుంతల

క్రమాన్ బాబ్జీ కమాన్!... ఓహో! ప్లై దిలే? ఇట్స్ నౌ ఎయిట్ థర్టీ! బస్ విల్ బి కమింగ్!!''
వందన కంగారు పడిపోతోంది!

''కమింగ్ మమ్మీ...'' ఏడేళ్ళ పసిగొంతు బదులు పల్కుతూ బెడ్‌రూమ్‌లోనుంచి బయటికి వచ్చింది.

సిమెంట్ కలర్ నిక్కర్, తెల్లని షర్టు - గంజి పెట్టి ఇస్త్రీతో వికసించిన రేకుల్లా నిక్కబొడుచుకుని మోయలేని పుస్తకాల బ్యాగ్‌ని గుండెల కద్దుకుని బయటికి వచ్చాడు, బాబ్జీ.

గబుక్కున అందుకుని బ్యాగ్‌లో పుస్తకాలు సర్దుతూ, చేతికి తగిలిన ఓ ప్లాస్టిక్ సంచీని పైకి లాగి ''వాటీస్ దిస్?'' అంటూనే చేయిపెట్టి చూసి, ''ఎక్కడివి ఈ కలర్ చాక్‌పీసులు?'' మీ ఫ్రెండ్స్ దగ్గర అడుక్కున్నావా? అలా అడగకూడదని చెప్పేనా? నీకేమైనా కావాలంటే ఇంట్లో అడగాలి. డాడీ కొనితెస్తారు. లేదా నేను కొని తెస్తాను. అంతేకానీ ఇలా మీ ఫ్రెండ్స్ దగ్గర తెచ్చుకోకూడదని చెప్పేనా?'' తన్నుకొస్తున్న కోపాన్ని పళ్ళలో బిగించింది.

''నో మమ్మీ! ఐ డింట్ ఆస్క్! 'బబ్లూ' గేవ్‌మి!'' చిన్నారి చేతులు గబగబా తిప్పేస్తూ. చెప్పేడు బాబ్జీ భయంగా చూస్తూ.

చప్పున చల్లారిపోయింది వందన!

బాబ్జీ అడగలేదని కాదు.

చక్కగా ఇంగ్లీషులో చెప్పాడు!

బాబ్జీని దగ్గరికి లాక్కుని, ''నైస్‌బోయ్! దట్సాల్‌రైట్!'' అంటూ ముద్దుపెట్టుకుంది.

చకచకా బ్యాగ్ సర్ది రాత్రి చేసిన హోంవర్క్ మేడమ్‌కి చూపించమని చెప్పి త్వరత్వరగా సాక్స్, బూట్స్ వేసి బ్యాగ్ బాబ్జీ వీపుకి తగిలించింది. టేబుల్‌మీదున్న బాస్కెట్ తను అందుకుంది. అందులో చిన్న టిఫెన్‌బాక్స్, వాటర్ బాటిల్, చేయి తుడుచుకుందుకు నాప్‌కిన్ వున్నాయి. చెప్పులు తొడుగుకుంటూ ''ఏమండీ? మేం వెళ్తున్నాం!'' అంది.

ఫైళ్ళమీద నుంచి అరక్షణం తలఎత్తి 'సరే' అన్నట్టుగ తల ఊపి మళ్ళీ తలవొంచుకున్నాడు ఉమామహేశ్వర్రావు. అతను అంత అర్జెంటుగ చూస్తున్న ఫైళ్ళు ఆఫీసులో చూసుకోవచ్చును. కానీ అక్కడ నిదానంగ చూస్తే వారంరోజులు పట్తుంది. ఇంటికి తెచ్చుకుని చూస్తే నాల్గురోజుల్లో పూర్తి చేయవచ్చును. దానివల్ల....?

వచ్చే నెలలో ప్రమోషన్లు రావాల్సిన, వాళ్ళ లిష్టులో మహేశం పేరు వుంటుంది! అదిగాకుండా డిపార్టుమెంటల్ టెస్ట్ కూడా రాయబోతున్నాడు. రాబోతున్న పదవి మీదా, పెరగబోతున్న జీతం మీద మహేశం, వందన ఎన్నో రోజుల ముందు నుంచే పునాదులు త్రవ్వుకుని అంతస్థులకి రూపాలు దిద్దుకుంటున్నారు.

మెయిన్‌రోడ్ దాటించి బస్సు స్టాపులో నిల్చోబెట్టింది, బాబ్జీని, వందన. అప్పటికే అక్కడ బిలబిలమంటూ పదిహేనుమంది ఆడా, మగ పిల్లలు, జూ పార్కులో పక్షుల్లా రంగురంగుల స్కూలు డ్రస్సులో మహా సందడి చేస్తున్నారు.
వందనకి రోజూ ఈ దృశ్యం కన్నులపండువగా వుంటుంది. వాళ్ళు గలగల ఇంగ్లీషులో మాట్లాడుకుంటే వీనులవిందుగ వింటుంది.

బాబ్జీని ముందువరసలో కూర్చోబెట్టి, బాస్కెట్టు అందించి, జాగ్రత్తలు చెప్పి....టా....టాలు చెప్పి. బస్సు కదిలాక మెల్లగా ఇంటికి వచ్చింది వందన.

అప్పటికి మహేశం ఫైళ్ళు సర్ది ఆఫీసుకి తయారవుతున్నాడు.

''వందనా వడ్డించేయ్ త్వరగా. బాబ్జీవాళ్ళ బస్సు వెళ్ళిందా?'' వెళ్ళకుండా ఆమె రాదని తెలిసినా, అలా అడగటం అలవాటు!

''ఆ! వెర్రి నాయన! చేసిన హోమ్ వర్కు చూపిస్తాడో....మర్చిపోతాడో....బాక్సులో చపాతి పెట్టేను. తింటాడో, ఆ బబ్లూగాడికి పెడ్తాడో.''

''అబ్బా! చూడు వందనా? వాడు 'ఏం చేస్తాడో' అని ఇప్పుడే దిగులుపడకు! వాడు వెరీగుడ్ బాయ్. అన్నీ సక్రమంగా చేస్తాడనే అనుకో..... ఊ! ఊ! నాకు వడ్డించు.....'' అన్నాడు.

''అవును. వాడు నిజంగా గుడ్‌బాయే!'' అనుకుంటూ టేబులు మీద పళ్ళెంలో కూరలు.... చపాతీ....అన్నం పెట్టింది. ''నువ్వు కూడా తినేయరాదూ? మళ్ళీ మీ ఫ్రెండ్స్ ఎవరైనా వచ్చారంటే మధ్యాహ్నం దాకా వదలరు. అహఁ! అలా కోపంగా చూడకు. మీది సత్కాలక్షేపమే అనుకో. అయినా నువ్వు భోజనం చేయకుండా వుండాల్సి వస్తుందన్న బాధ నాది: అదీ గాక కలిసితింటే బాగుంటుంది కదా?'' చివరి మాటలు మంద్రస్థాయిలో అనేసరికి, వందన ముఖంలో చిరుసిగ్గులు దోబూచులాడేయి! ''ఊ! కబుర్ల కేం? ముందు టెస్ట్ సంగతి చూసుకోండి. మొన్న మా పద్మావతిగారి భర్తకి-అసిస్టెంట్ సెక్రట్రీ పోస్టు వచ్చింది. మనం త్వరగా పైమెట్టు కెక్కాలి!'' అంది.

''ఆయన సీనియర్ మోస్ట్! రాకేం చేస్తుంది? ఆ వయస్సుదాకా ఆగితే నాకు కూడా....''

''సరేలెండి అప్పుడు తీరిగ్గా చత్వారపు కళ్ళజోళ్ళోనుంచి నేను మిమ్మల్ని చూసి ఆనందిస్తాను జుట్టంతా రాలి బట్టతలతో మీరు నన్ను...''

''అంటే!! ఇంక ఆ వయస్సులో భార్యాభర్తలకి ఏమీ అనురాగాలు వుండవంటావా?'' మహేశం కవ్వింపుగా అడిగేసరికి పక్కుమంది వందన.

''వుంటాయి వుంటాయి మన పెద్దాళ్ళులేరూ? అలాగే మనం కూడా.''

''మీ పద్మావతిగారో?''

''వాళ్ళకేమండీ!? ఆయనకి ఈ ప్రమోషన్ వచ్చినా రాకపోయినా ఇబ్బందిలేదు వాళ్ళబ్బాయి డాక్టర్. వాళ్ళమ్మాయి లెక్చరర్. ఆవిడ జర్నలిస్టు. వాళ్ళెంత అప్ టు డేట్‌గా వుంటారనీ? వాళ్ళ ఆలోచనలూ, వాళ్ళ విధానాలూ అన్నీ హైలెవల్లోనే

వుంటాయి. మొదట్లో ఆవిడతో నాకు స్నేహమేమిటా?' అని సందేహించేను. కానీ పద్మావతి గారే స్వయంగా వచ్చి 'నేటి తరం మహిళ' అన్న శీర్షికకి నన్ను ఇంటర్వ్యూ చేసి ఫోటోలు తీసుకెళ్ళేక ధైర్యం వచ్చింది. నా ఆశయాల్ని ఆవిడ ఎంతగా మెచ్చుకుందో? నన్ను ఎంత ప్రోత్సహిస్తారో ఆవిడ ''

''ఓ. కే! ఒప్పుకున్నాను. పద్మావతిగారి భర్తగారు అసిస్టెంట్ సెక్రట్రీ (పెద్దవాడయ్యాక) అయినా నేను మాత్రం త్వరలో ప్రమోషన్ తెచ్చుకుని ఆఫీసర్ రాంక్‌లో చేరాలంటావ్? నిజమే నా పట్టుదల కూడా అదే వందనా! అందుకేకదా ఇంత దీక్షగా చదువుతున్నాను'' భర్త కంఠంలోని నిజాయితీకి వందన గర్వంగా చూసింది.

*

మధ్యాహ్నం పదిమనిషి ముత్యాలు అంట్లు తోముతూ వుంటే దాని కళ్ళెందుకో ఎర్రగా ఉబ్బి వున్నట్టు గమనించింది వందన.

''ఏమిటే ముత్యాలు? మీ ఆయన మళ్ళీ కొట్టేడా? ఏడ్చినట్టున్నావేం?'' అనడిగింది.

''ఏదోలెండమ్మా! ఈ ఏడుపు నా బతుకంతా ఉండేదే! ఆడికి బుద్ధి రాదు. నేను యాడికీ పోలేను'' అంది విరక్తిగా.

''అదిగో అదే వద్దన్నాను. వాడికి, నీవే అలుసు ఇచ్చుకున్నావు! నువ్వు అణిగిమణిగి పడివున్నంతకాలం వాడు అలా పొట్లగిత్తలా తంతూనేవుంటాడు. నువ్వూ సంపాదిస్తున్నావు. వాడేమి నిన్ను పోషించడంలేదు. నిన్ను కొట్టే హక్కు వాడికి లేదు.''

''ఏమోనమ్మా హక్కులు హద్దులు మాకేటి తెలుస్తాయి?''

''అదే అదే మీ అమాయకత్వం! అక్షరం ముక్క లేకపోవడమే ఇందుకు కారణం! పిచ్చిమొద్దూ నేను చెప్తూనేవున్నాను సరేలే ఈసారి వాడు చెయ్యి చేసుకుంటే ఊరుకోవద్దు తెల్సిందా?''

ముత్యాలు 'ఊరుకోను' అనలేకపోయింది. మౌనంగా తన పని చేసుకుంటోంది.


వందన మాత్రం ముత్యాల్ని గురించి తీవ్రంగా ఆలోచిస్తూ కూర్చుంది. దాని జీవితాన్ని బాగు చేయాలనీ దుర్మార్గుడైన దాని భర్తనుంచి దానిని కాపాడి రక్షించాలనీ ఆ బాధ్యత తను తీసుకోవాలనీ ఆ భారం తనదే అనీ గట్టిగా అనుకుంది. రెండు రోజుల క్రితం పద్మావతిగారూ, స్రవంతిగారు తమ ఇంట్లో చెప్పిన విషయం గుర్తు వచ్చింది — 'వచ్చే నెలలో మనం నగరం అంతా తిరిగి 'ఈ దశాబ్దపు వనిత'ని గురించి మేటర్ సేకరిద్దాం! అందులో బీదా గొప్ప చిన్నా పెద్ద అన్న బేధం వుండకూడదు' అన్నారు.

నిజమేకదా? ప్రతి గృహిణియొక్క ఆలోచనా సరళి, ఆచరణలు, జీవిత విధానం తెలియాలి! సగటు ఇల్లాలి దృక్పథం మారనంతవరకు ఈ సమాజం బాగుపడదు! సామాన్య స్త్రీ కూపస్థమండూకంలా మిగిలిపోతోంది. ఇక పాటక జాతి స్త్రీని గురించి విచారించి లాభమేమిటీ? దీనికంతకీ కారణం నిరక్షరాస్యతే! అందుకే తను ఈ మధ్య వయోజన విద్యని గురించి ప్రచారం చేస్తోంది. ముందు ముందు బాగా ఉత్సాహం వున్నవాళ్ళందర్నీ చేరదీసి తను స్వయంగా విద్యాదానం చేయాలి. ముఖ్యంగా ఈ ముత్యాలుకి ముందు నాల్గు అక్షరం ముక్కలు నేర్పాలి.

కుర్చీలో వెనక్కివాలి అలా ఊహా సౌధాల్లోకి వెళ్ళిపోతోంది వందన.

మధ్య తరగతి కుటుంబంలో ఒక వారపడిలో కొట్టుకుపోతున్న అత్తవారిల్లు గుర్తు వచ్చింది. ఎదుగూ, బొదుగూ లేని సామాన్య జీవితాలు! తను బి.య్యే చదువుకొని ఆ ఇంటి కోడలుగ వెళ్ళిందంటే, కేవలం మహేశాన్ని వదులుకోలేకనే! అయినా తన అదృష్టం! వారికి పెళ్ళికి ముందే హైదరాబాదులో ఉద్యోగం వచ్చివుండటం వలన — ఆ ఊళ్ళో వాళ్ళదగ్గర వుండాల్సిన అవసరం లేకపోయింది. కన్నందుకు పెంచి పెద్ద చేయడం....ఎవరి దారిన వారిని పంపించేయడం.... అదే గొప్ప ఘనకార్యం కాబోలు! వయస్సుడిగి అత్తా మామా, అలారొటీన్ బ్రతుకు బ్రతికేస్తూ ఏ విధమైన వ్యాపకం పెట్టుకోకుండా ఎలా వుండగలరో అని అబ్బురపడ్తూ వుంటుంది!

అంతే! కొందరి జీవితాల్లో ఏ గొప్ప ఉద్దేశ్యాలూ వుండవు. సామాన్య బ్రతుకులు అను



కుంది. ముత్యాలు పని చేసుకుని వెళ్ళిపోయేక మామూలు ప్రపంచంలో పడింది వందన.

❋

వారం రోజుల తర్వాత బాబ్జీ ప్రోగ్రస్ కార్డు తెచ్చాడు. చూసింది వందన. మొదటి ఐదుగురిలో లేడు. ఎనిమిదో రాంక్ వచ్చాడు.

అనుకోని అవాంతరం ఇది!

బాబ్జీని బాగా చదివించి ఇప్పటికి థర్డ్ రాంక్ వచ్చేలా చేయాలనీ, ఆ తర్వాత ఏన్యువల్ పరీక్షల్లో ఫస్టు రాంక్ రావాలనీ వందన, మహేశం కూడా ఆశించేరు. కానీ ఇదేమిటీ? ఎనిమిదో స్థానం వచ్చిందా? పైగా ఆ బబ్లూగాడు ఫోర్త్ రాంక్ వచ్చేడని చెపున్నాడు.



ఇంక వందన సహించలేకపోయింది. రాత్రింబవళ్ళు బాబ్జీని రుబ్బేయడం మొదలుపెట్టింది. సాయంత్రం స్కూలు నుండి రాగానే అరగంట మాత్రమే విశ్రాంతి! ఆ తర్వాత పుస్తకాలు ముందేసుకుని వాణ్ణి కూర్చోబెట్టుకుని రెండు మూడు గంటలు చెప్తోంది, చదువు. వాడు బయటికి కదలడానికి వీల్లేదు. పనికిమాలిన వెధవలతో ఆటలాడి నేర్చుకున్న విద్యంతా మర్చిపోతున్నాడు. 'ఒరేయ్ బాబ్జీ....నీకు ఒక్క తెలుగు పద్యం కూడా రాదా?' అని ఒకరు....'నీకు తెలుగు అక్షరాలే రావా?' అని మరో సన్నాసి. వాణ్ణి అడిగి వచ్చిన ఇంగ్లీషంతా మర్చిపోయేలాగా అంతా తెలుగులోనే మాట్లాడిస్తున్నారు. ఛీ! ఛీ! వాళ్ళ దగ్గరకి పంపించకూడదు. అయినా తెలుగు మీడియం పిల్లలతో వీడికి స్నేహమేమిటి? — వీళ్ళ తాత, వీళ్ళ నాన్నని ప్రభుత్వ పాఠశాలలో తెలుగులో చదివించబట్టే, ఇదిగో ఈనాడు ఇలా ప్రమోషన్ల కోసం చెప్పులు రాయాల్సి వస్తోంది. మొదట్లోనే డైరెక్టుగ ఏ ఆఫీసరో అయివుంటే ఈనాటికి ఎంత పెద్ద పొజిషన్‌లో వుండేవాళ్ళమో? బాబ్జీని రోజూ బస్సులో పంపించే-ఖర్మేమిటీ? చక్కగా కార్లో తీసుకెళ్ళి స్కూల్లో దింపి అటు నుంచి అటు ఆఫీసుకి వెళ్ళేవారు ఆయన! ప్చ్! ప్చ్! చిన్నప్పుడు, అమ్మా నాన్నా-గాలివాటుగ పెంచితే పిల్లలు ఏం అభివృద్ధిలోకి వస్తారూ? ఉహూ! బాబ్జీని అలా పెంచం! ఫస్టు రాంక్ వచ్చితీరాలి! ప్రతిజ్ఞ పూనింది....వందన. పతిరోజూ నూరిపోస్తోంది, సబ్జక్టులన్నీ!

ఓ రోజు సాయంత్రం బాబ్జీకి శ్రద్ధగా పాఠం చెప్తున్న సమయంలో ముత్యాలు తన పని ముగించుకుని వెళ్తూ, 'అమ్మగారూ!' అని పిల్చింది. 'ఏమటన్నట్టు' చూసింది వందన.

అది చిరునవ్వులు చిందిస్తూ, "మా మొగోడు కూడా ఒప్పుకున్నాడండీ. అమ్మగారి కాడ నాల్గు అచ్చరం ముక్కలు నేర్చుకోమన్నాడండీ? ఇక నుంచీ పెతీరోజూ సాయంత్రం నేర్పిత్తా రాండి? పలకా బలపం తెచ్చుకుంటానండి." ముప్పైఏళ్ళ ముత్యాలు నల్గురు బిడ్డల తల్లి - అలా సరదాపడి అడుగుతుంటే, ఎగిరి గంతేసి అప్పటికప్పుడే 'అ ఆ'లు దిద్దబెట్టేది వందన. కానీ పరిస్థితి వేరుగ వుంది. ఈ సాయంకాలం సమయాన్ని బాబ్జీకి తప్ప మరొకరికోసం వినియోగించడానికి కుదరదు.

అందుకే - "చూద్దాంలే! నా వీలు కూడా చూసుకున్నాక!" నిరాసక్తిగా అని బాబ్జీ వైపు తిరిగింది.

ముత్యాలు 'సరేలెండి' అంటూ నవ్వుతున్న ముఖం వెంటనే చిన్నబుచ్చుకుని మెల్లగా వెళ్ళిపోయింది.

మర్నాడు మహేశం భోజనం చేస్తున్నప్పుడు ఓ సంగతి చెప్పాడు.

"వందనా! ఆఫీసుకి రోజూ లేటుగానే వెళ్తున్నాను. దిక్కుమాలిన బస్సులు దొరకటం లేదు. ప్రతిరోజూ అటో ఎక్కాలంటే కష్టంగదా? అందుకే మా ఫ్రెండ్ ఓ సలహా చెప్పాడు. వాళ్ళ బాబాయ్ స్కూటర్ అమ్మేస్తాట్ట! సెకండ్ హాండ్ అయినా చాలా మంచిబండట! తెల్సున్నవాళ్ళం కనుక తక్కువలో వచ్చేటట్టు చూస్తాను అన్నాడు. ప్రస్తుతం అంత డబ్బు ఇయ్యలేకపోతే సగం ముందు ఇచ్చేసి మిగతా డబ్బు రెండు వాయిదాల్లో సర్దమంటున్నాడు. ఇంతటి అవకాశం మళ్ళీ వస్తుందా? అందుకని కొనేద్దామనుకుంటున్నాను."

"అనుకోడమేమిటండి? కొనేయండి! అమ్మో ఎంచక్కటి ఫ్రెండో? అసలు మనం ఎప్పుడో కొనాల్సింది. కానీ ఏదీ? కొత్తది కొనాలంటే, బుక్ చేయించి వచ్చేదాకా ఎదురుచూడాలి. ఈ లోపులో ఈ అవస్థలు ఇలా పడుతున్నాం! నేను మొన్ననే అనుకున్నాను. బాబ్జీని కూడా బస్సులో పంపించడం కష్టంగా వుందని! ఇప్పుడు స్కూటర్ కొంటే ఏ బాధా వుండదు. మీరు వాణ్ణి స్కూల్లో డ్రాప్ చేసి, ఆఫీసుకెళ్ళిపోవచ్చును. ఇవాళే బ్యాంక్ బాలెన్సు ఎంతవుందో, చూసి తీసేయండి. మళ్ళీ ఎవరికీ మాట ఇవ్వొద్దని చెప్పండి." వందనకి ఆనందంతో, హృదయం ఎగిసిపడుతోంది!! ఇంత త్వరలో తన కోరిక ఈవిధంగా తీరుతుందనుకోలేదు. ఇలాగే భవిష్యత్తులో కారు కూడా కొంటామేమో?

"అవును బాబ్జీని కూడా తీసుకెళ్తూ వుండొచ్చును. ప్రతీరోజూ నువ్వు వాణ్ణి తీసుకుని వెళ్ళే తీరు నాకూ బాధగానే వుంది. అవసోపాలు ఉరుకులు పరుగులు అన్నీ తప్పుతాయి!" మహేశం భోజనం ముగించి ఆఫీసుకెళ్ళిపోయేడు. వందన ఇల్లంతా సర్దుకుని తీరిగ్గా కూర్చుని రాబోయే స్కూటర్‌ని ఎక్కడ ఎలా పెట్టాలా అని ఆలోచిస్తోంది.

అనుకున్న ప్రకారం, 'పదిరోజుల్లో స్కూటర్ కొనేసేడు మహేశం. తొమ్మిదింటికల్లా బాబ్జీనీ, భర్తనీ స్కూటర్‌మీద సాగనంపడం ఎంతో తృప్తిగా వుంది వందనకి! సాయంత్రం ఇంటికి

రాగానే - బాబ్జీని కాస రిలాక్స్ కానిచ్చి మొద లెట్టుంది పాఠాలు, అది చాలక రెండుసార్లు స్కూలుకి వెళ్ళి 'మా బాబ్జీ ఏమైనా ప్రామిసింగ్‌గా కనిపిస్తాడా?' అని అడిగి తెలుసుకుంది.

ఓరోజు మహేశం, అప్పటికి డిపార్ట్‌మెంటల్ టెస్ట్ రాసేసి హాయిగా ఊపిరి పీల్చుకున్నాక — ఇంటికి వచ్చి, "మా నాన్నదగ్గర్నుంచి లెటర్ వచ్చింది వందనా!" అన్నాడు, డ్రస్సు మార్చుకుంటూ!

"ఏమిటట?" అనడిగింది బాబ్జీకి లెక్కలు చెప్తూ...

"ఏంలేదు! ఈమధ్య యాత్రా స్పెషల్‌లో దక్షిణ యాత్రలన్నీ చేయాలనుకున్నారుట 'కానీ వీలుకాలేదు మానేశాం!' అనీ మనం కులాసాగా వున్నట్టూ బాబ్జీ బాగా చదువుకున్నట్టూ తలుస్తామని రాసేరు!"

"యాత్రలకి వెళ్ళడానికి వీలుకాలేదా? దేనికైనా మనిషికి కార్యదీక్ష వుండాలండీ! అసలు గట్టిగా అనుకుంటే ఎందుకు వెళ్ళలేరూ? పోనీయండి" నిర్లక్షంగా అని బాబ్జీకి లెక్కలు చెప్పడంలో లీనమయింది! తెల్లవారితే వాడికి లెక్కల టెస్ట్ వుంది!

వందన పడిన శ్రమకి ఫలితం దక్కింది.

బాబ్జీ ఆ ర్నెల్ల టెస్టులన్నిటిలో బాగా మార్కులు తెచ్చుకుని ఫోర్త్ రాంక్ రాగల్గేడు.

"హమ్మయ్య చూసేరా ఎలా సాధించేనో విజయం?" అన్నట్టుగా చూసింది మహేశంవైపు. సరిగ్గా ఆ సమయంలోనే తను టెస్టు ప్యాసైనట్టు మళ్ళీ నెలలో ప్రమోషన్ రాబోతున్నట్టు చెప్పేడు.

"నిజంగానా!!" ఉప్పొంగిపోయింది వందన.

"నిజమేనోయ్! కానీ జాగ్రత్త! కింద చూసుకుని నడువు. మరీ అలా గాలిలో తేలిపోకు!"


"చాల్లెండి! ఇదేమన్నా లాట్రీలో గెలుపా? కష్టపడినదానికి ప్రతిఫలమండీ? మనిషి తల్చుకుంటే ఏదైనా చేయవచ్చునని ఋజువు చూపే సాక్ష్యమండీ! మనోధైర్యాన్ని పెంపొందించే దానిక్కేనండి."

"బాబోయ్ చాలు చాలు. ఝాన్సీరాణీ, రుద్రమాంబల్ని తలపిస్తున్నావ్! అన్నట్టు మర్చిపోయేను. మీరంతా ఏదో సర్వే చేయాలనుకున్నారు గదా ఏమైందీ ఆ కార్యక్రమం?" ఆమె ఊపు తగ్గించే ప్రయత్నంలో ఆ ప్రశ్న వేసేడు మహేశం!

నవ్వింది! "ఏదీ నాకు తీరికలేకపోయింది — బాబ్జీని చూసుకోడం తోటే సరిపోయింది, ఆ పద్మావతిగారూ, స్రవంతిగారే వెళ్ళివచ్చారుట! ఇవాళో రేపో వెళ్ళి ఎన్ని విషయాలు సేకరించుకుని వచ్చారో చూస్తాను" అంది.

ఆ మర్నాడే పద్మావతిగారింటికి వెళ్ళింది. ఆవిడ అప్పటికే కొన్ని యదార్ధగాథల్ని ఫోటోలనీ ప్రముఖ పత్రికలకి పంపించేసేరు. మిగిలినవాటిని వివరించి చూపెట్టేరు.

"చూడమ్మా వందనా నువ్వు రాలేదుగానీ, వెరీ ఇంట్రెస్టెడ్ కేసులు కొన్ని చూసేమమ్మా! అఫ్‌కోర్స్ కొందరు అసలు బిర్రబిగుసుకుని మాట్లాడ



భీమా ?!

"అమ్మా...అమ్మా.... నేను ఈత కొడతానమ్మా."

"వద్దుబాబూ.... ఈ సముద్రంలో తిమింగిలాలు వుంటాయి"

"మరి నాన్నగారు ఈతకొడుతున్నారు?"

"ఆయన ఇన్సూర్ చేసుకున్నారుగా."

లేదనుకో! అది వేరే సంగతి! ఒకావిడ తనని గురించి చెప్తూ ఎంత గొప్పగా ఫీలైందో నిజంగా చూడాల్సిందే!! ఆ వ్యాసమే ముందు పంపించేను. ఇక కొందరు అసలు ఈ దశాబ్దానికి ఏమిటి విలువ? ఎందుకింత ప్రాముఖ్య? ప్రచారం? మీకేం పని పాటా లేదా? వెళ్ళండని దులిపిపారేసేరనుకో ఏమిటో అజ్ఞానులు."

"అంతేనండీ! ఎన్నాళ్ళైనా అలా చీకటి కోణాల్లో మగ్గిపోతారు తప్ప వెలుగు చూడరు" అని నిట్టూర్చింది వందన. వాళ్ళింట్లో ఉన్నంతసేపూ వందన అర్ధనిమీలిత నేత్రాలతో తాము ముందు ముందు ఎక్కబోయే 'ప్రగతి భవనపు మెట్లని ఊహించుకుంటూ వుంటుంది. అందులో కొన్ని సోపానాలు ఎక్కేస్తున్నట్టు భావిస్తుంది.

*

"హాయ్! కంగ్రాట్యులేషన్! రండి రండి మీరు మా హాల్లోకి మారడం మాకు చాలా ఆనందంగా వుంది! బైదిబై మన అసిస్టెంట్ డైరక్టర్ ఇవాళ సెలవలో వున్నారు. గనుక మీరూ మేమూ ఆట్టే వొళ్ళు విరుచుకోనక్కర్లేదు. టీలో టిఫిన్లో తెప్పించుకుని ఇక్కడే ఆరగించవచ్చును" అంటూ గలగల నవ్వేడు ఆ హాల్లోనే వున్న మరో సెక్షన్ హెడ్! మహేశానికి ప్రమోషన్ వచ్చిన సందర్భంలో జరిగిన సన్నివేశం అది! రెండు సెక్షన్ల హెడ్లూ ఆ హాల్లోనే చెరొక కుర్చీల్లో కూర్చుంటారు. ఆ రెండు సెక్షన్ల ఏ. డి. గారు ఒక్కరే!

సమాన హోదాల్లో వున్నవారు గనుక చనువుగా పల్కరిస్తూ జోక్స్ విసురుతూవుంటాడు అతడు.

మహేశం నవ్వి ఊరుకుంటాడు.

బాస్ మీద రకరకాల వ్యాఖ్యానాలు చేస్తుంటాడు. అలాంటివి విన్నప్పుడు అచ్చెరవునొంది మళ్ళీ సర్దుకుంటూ వుంటాడు మహేశం. ఒకరోజు ఏ. డీ గారు మహేశాన్ని రూమ్‌లోకి పిల్చి, ఎంతో ఆప్యాయంగ మాట్లాడి ఇంటి అడ్రస్ అడిగి తెలుసుకున్నాడు. మహేశానికి అయోమయంగ అనిపించినా ఏమీ ప్రశ్నించలేదు.

స్కూలు దగ్గర బాబ్జీని రిసీవ్ చేసుకుని ఇంటికి వచ్చాడు.

సరిగ్గా ఆ సమయంలో వంధన చేతిలో ఒక వార పత్రిక పట్టుకుని ఆత్రంగ చదువుతోంది.

మహేశం, బాబ్జీ లోపలికి వచ్చి పది నిముషాలైనా ఆమె పట్టించుకోలేదు.

"ఏమిటోయ్? మరీ అంతలా అతుక్కుపోతున్నావ్ పుస్తకంలోకి ఏముందేమిటి?" అన్నాడు నవ్వుతూ. ఇంతసేపటి వరకు తనవైపు చూడకపోయినా బాబ్జీని చూడకుండా వుండలేదే? అన్న విభ్రమంతో....

ఆమె తలఎత్తి, కళ్ళింతింతచేసి "చూడండి ఇది? ఏముందో చదవండి!" అంది.

మహేశం వార పత్రిక అందుకున్నాడు.

ఇంతలో బయట కారు ఆగింది. తమ ఏ. డీ గారు అందులో నుంచి దిగడంచూసి, తెగ కంగారు పడిపోయేడు. "మా ఏ. డి గారు....మా ఏ. డీ గారు....ఆ సోఫా సర్దు, కాఫీ పట్రా....అయ్యో

ఇదేమిటి ఇలా వచ్చేసేరు....'' అంటూ మళ్ళీ గబగబా ప్యాంటు తగిలించి, షర్టు వేసుకో బోతుంటే ఆయన అప్పటికే లోపలికి వచ్చేసేరు!

''కూర్చోండి సార్! మీరిలా....''

''కంగారు పడకు మిస్టర్ మహేశ్. నేను కూర్చుంటాలే! మీ బాబా? వెరీ నైస్! ఆ! చూడూ అలా కూర్చో మహేశం! చిన్నప్పుడు నువ్వు అచ్చం ఇలాగే వుండేవాడివి! మీ అమ్మగారు నీ క్రాపు దువ్వి చొక్కా లాగూ వేసి, బుగ్గ మీద గట్టిగా ముద్దెట్టుకునేవారు. 'బిళ్ళో తినమ్మా' అని చక్కిలాలు పొట్లంగట్టి ఇచ్చేవారు. మీ అన్నయ్యా, అక్కయ్యా కొంచెం పెద్దాళ్ళం గనుక దులపరించుకుని వెళ్ళిపోయేవారు. మీ నాన్నగారు నీ వేలు పట్టుకుని స్కూలుదాకా తీసుకెళ్ళి, దింపి ఆయన ఆఫీసుకి వెళ్ళిపోయేవారు.

''సార్! సార్! ఇవన్నీ మీకు....

''తెలుసు మహేశం! నేను అప్పుడు మీ ఇంట్లోనే వుండేవాడిని. నువ్వు చాలా చిన్నవాడివి. నీకు గుర్తులేదు. కానీ, మీ ఇంట్లో మీ నాన్న ఓ అనాథ బాలుడికి భోజనం పెట్టుతుండేవారు. గోదావరి వరదల్లో మా అమ్మా నాన్నా కొట్టుకుపోతే దూరపు బంధువులు పట్టించుకోక పోతే....మీ నాన్నగారు కేవలం మా నాన్నతో వున్న పరిచయమే తప్ప మరేవిధమైన చుట్టరికం లేకపోయినా నన్ను దగ్గరకి తీసుకుని ఆదరించేరు! మీ అన్నయ్య అప్పుడప్పుడు నాతో దెబ్బలాడి 'పొమ్మ'నేవాడు. కానీ, మీ నాన్నగారు 'తమ్ముడు తిడితే బాధపడకూడదు బాబూ' అని లాలించేవారు. మెట్రిక్ పరీక్ష కట్టించి, ప్యూనయ్యాక చిన్న ఉద్యోగంలో వేయించి, నా కాళ్ళమీద నన్ను నిలబడేటట్టు చేసేరు. ఆ తర్వాత పెళ్ళిచేసుకుని జీవితంలో స్థిరపడ్డాక కూడా నాన్నగార్కి ఉత్తరాలు వ్రాస్తుండేవాడిని.....నేనూ పెద్దవాడి నవుతున్నాను, బాధ్యతల్లో మునిగిపోతున్నాను. ఏమిటో ఒక్కసారి వెళ్ళి అమ్మగార్ని నాన్నగార్ని చూడాలనివుంది గానీ కుదరటం లేదు. వాళ్ళు కులాసాగా వున్నారు కదూ?....నువ్వు ఇక్కడ వున్నట్టు నాకు తెలియదు సుమా....మొన్ననే తెల్సింది....''

''ఆ! ఆ! కులాసాగానే వున్నారు.''

కాఫీ తీసుకువచ్చిన వందనని ''రామ్మా'' అని ఆప్యాయంగ పిల్చేరు. ''మీ మామగారు అత్తగారు నాకు తల్లిదండ్రులాంటి వారమ్మా! నా లాంటివారి నెందరినో ఆయన ఆదుకున్నారు. కానీ ఎప్పుడూ ఎవ్వరికీ చెప్పేవారు కాదు. మీ అత్తగారూ అంతే! ఇంటికి వచ్చే చుట్టాలకి లేదన కుండా చేసి పెట్టేవారు. తనకంటూ ఏదీ కోరిక వున్నట్టు కన్పించేవారు కాదు. ఏదైనా అనుకున్నది జరగకపోతే, ఆవిడ చింతపడేవారే కాదు. 'పోనీలే!' అని సమాధానపడేవారు. అమ్మా! ఎప్పుడైనా ఇక్కడికి వస్తుంటారా? వస్తే మా ఇంట్లో తప్పకుండా నెల్లాళ్ళు వుంచుకుంటాను. చెప్పండి నాకు.'' ఆయన కంఠంలో ఆప్యాయం సుళ్ళు తిరిగిపోతోంది!

''ఆ! ఆ! అలాగే'' తడబడింది వందన. ఆమె కాళ్ళు నిలవటంలేదు. మనసు ఏదోలా అయిపోతోంది. చటుక్కున టేబుల్‌మీద పత్రిక అందుకుని, ''ఇది చూడండి ఇందులో ఆవిడ్ని మీరు గుర్తు పట్టగలరా? చదవండి ఆ వ్యాసం.'' అని ఎ.డి గారి చేతికి వార పత్రిక అందించింది వందన.

ఆయన రెండు నిముషాలు దీర్ఘంగా చూసి. ఆ తర్వాత చదివేక, ''నేను ఆ ఊరునుంచి వచ్చేసాక జరిగివుంటుంది. మీ మామగారు తనకు తానుగా ఏదీ చెప్పుకోరుకదా? అయితే ఈ 'సుందరి' అన్న అమ్మాయిని ఆత్మహత్యా ప్రయత్నం నుంచి కాపాడి సేవాసదనంలో చేర్పించే రన్నమాట! ఇదిగో అన్నీ విపులంగా రాసేరు కదా?'' అని పైకి చదివేరు.

''అనాడు దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్యకి సిద్ధమైన నన్ను దయామయుడు, ఆపత్‌బాంధవుడు, పురుషోత్తమరావుగారు కాపాడి జీవితం మీద ఆశ కల్పించి, నన్ను మనిషిగా నిలబెట్టేరు. తండ్రి ఎవరో తెలియని నా కొడుకుని ఈనాడు సమాజంలో ఓ పరిపూర్ణ వ్యక్తిగా తీర్చిదిద్దగల్గేను. ఇదంతా ఆ మహనీయుని చలవ! జీవితాంతం పోషించక్కర్లేదు. నీటికి కొట్టుకుపోయే తరుణంలో గట్టుకులాగే ప్రయత్నం, చేయూత చాలు!! అలా ఇవ్వగల్గేవాళ్ళే సమాజంలో వెలసిన దేవుళ్ళు! ఈనాడు నాకు దేనికీ భయపడని ఆత్మవిశ్వాసం వుంది, సాటి వారికి సానుభూతి చూపగల మనసుంది. నిజాయితీగా బ్రతుకుతున్న సంతృప్తి వుంది. పురుషోత్తమరావుగార్కి ఎల్లవేళలా నా భక్తి సుమాంజలులు అర్పించుకుంటాను.''


''అవునమ్మా మీ మామగారు మహనీయులే. చూడమ్మా ఆశయాలు అందరికీ వుండవు. వున్నా, సాగవు. ఒకవేళ ఆ ఆశయాన్ని నెరవేర్చుకోవాలన్నా ఎన్నెన్ని స్వార్థాలో అడ్డువస్తుంటాయి. ఆశయాల సెలయేళ్ళుగలగలా పారాలంటే స్వార్థపు అడ్డురాళ్ళు దారికడ్డం పడితే, ఆ ఏరు అందంగా పారదమ్మా! ఆ మహేశం....నాకు చాలా ఆనందంగా వుంది. ఇలా పత్రికలో పడ్డ వ్యాసం వల్లనేనా కొందరు కరుణామూర్తులు బయటికి వస్తారు. ఇవాళ మిమ్మల్ని చూస్తుంటే మీ నాన్నగార్ని అమ్మగార్ని చూసినంత ఆనందంగా వుంది. వస్తాను మరి'' అంటూ బాబ్జీ తలనిమిరి బయటికి నడిచేరు.

వారు వెళ్ళిపోతుంటే స్థాణువులా నిలబడ్డ మహేశం, వందన తేరుకుని నమస్కారం పెట్టేరు.

తమని అమ్మా నాన్నలతో సమంగా చూడ్డం... గిల్టీగ ఫీలై ఒకరినొకరు చూసుకుని ఒకేసారి, అత్తగార్ని మామగార్ని తలుచుకుని ఇద్దరూ దండంపెట్టారు.

ఎదురుగా ఏ దేవుడి బొమ్మా లేకుండా ఎవరికి నమస్కారం పెట్టున్నారో అర్థంగాక బాబ్జీ వింతగా చూసేడు.

ఎ.డిగారు చెప్పినదేమీ వాడికి తెలియలేదు. పత్రిక చదవాలంటే తెలుగురాదు'' మరివాడు తెల్లబోక ఏం చేస్తాడు?



## అయితే ఆర్నెల్ల తర్వాత!

"నీకు ఇప్పుడు నెలకి మూడొందలు ఇస్తాను. ఆర్నెల్ల తర్వాత నెలకి నాలుగొందలు ఇస్తాను" అన్నాడు దుకాణం యజమాని నిరుద్యోగితో.

"అయితే ఆర్నెల్ల తర్వాతే వస్తాను" సమాధానం చెప్పాడు నిరుద్యోగి.